అభ్యుదయ గల్పిక

# ★ జ్ఞానోదయం ★

పూ. భా.

'అపూర్వావకాశం!

కావ్యాలూ, ఖండ కావ్యాలూ, నాటకాలూ, నాటికలూ, నవలలూ, నవలికలూ, కథలూ, కథానికలూ, ఏవైనా సరే అముద్రితంగా ఉన్నాయని వ్యసనపడ నక్కరలేదు. శ్రీ జ్ఞానోదయా ప్రచురణల వారు అన్ని విధాలా తగిన సహకారం యివ్వడానికి కంకణం కట్టుకున్నారు. రచయితలకు యింతకన్నా మంచి తరుణం లభించదు. త్వరపడండి! మీ తాలూకు వ్రాత ప్రతులతో మా కార్యాలయానికి హాజరు కావచ్చు.'

* * *

పై ప్రకటన దివ్యశ్రీని బాగా ఆకర్షించింది. రెండు మూడుసార్లు చదివాడు. లోలోపల పొంగిపోయాడు. అలాటి ప్రకటన ఎన్నడూ చూస్తానని అనుకోలేదు. కాని అలాటి అవకాశానికి మాత్రం ఎదురు చూస్తున్నాడు దివ్యశ్రీ. తన భాగ్యం పండిందనుకున్నాడు. గబగబా వెళ్లి అముద్రితంగా ఉన్న తన కథానికల పుస్తకాల్ని మరోసారి లెక్కపెట్టాడు. పదమూడూ సరిగ్గా ఉన్నాయి.

దివ్యశ్రీ ఒక రచయిత. అడపాతడపా అతని రచనలు ఆ-యీ, పత్రికల్లో పడుతూండేవి. కాని అతనికి ప్రతిఫలంమాత్రం కిట్టుబాటుగా ఉండేది కాదు. వ్రాయడం మానుకున్నాడు. అందుచేత ఓ డజను కథలు వ్రాసి ఏ ప్రచురణ కర్తకో అమ్మితుంటే కిట్టుబాటు అవచ్చునని నిశ్చయించుకుని అప్పటినుంచీ ఇటువంటి అవకాశానికి ఎదురు చూస్తున్నాడు.

తను వ్రాసిన ప్రతి పుస్తకంలోని అతిమిక్కిలి మంచి కథానికనీ ఎంచి తీసి వేరే వ్రాసాడు. యీ కథానికల్ని ఒక పుస్తకరూపంలో తీసుకురావాలని అభిలాష.

జ్ఞానోదయా ప్రచురణాలయానికి వెంటనే బయల్దేరుదా మనుకున్నాడు కాని మనీపర్సు బరువుగా లేదు. యథార్థం చెప్పవలసివస్తే రచయితల మనీపర్సులు ఎప్పుడూ బరువుగా ఉండవు.

జ్ఞానోదయా ప్రచురణల వారికి తన పుస్తకాన్ని యివ్వగానే కొంత డబ్బు యిస్తారనే నమ్మకంతో అప్పుచేసి బయల్దేరాడు.

* * *

'జ్ఞానోదయా ప్రచురణ కర్తలు తమరేనా?'

'అవునండి...తమ పేరు'

'దివ్యశ్రీ'

'ఓహో మీరా! మిమ్మల్ని రమ్మనమని వ్రాసినట్టున్నాం'

'లేదులెండి, నేనే వచ్చాను మీ ప్రకటన చూసి'

'చాలా సంతోషం!'

'మీరు యీ ఉద్యమానికి పూనుకోవడం ఎంతో ముదావహం'

'లేకపోతే ఎలాగండి మీబోటి రచయితలకి ఎంతమందికి ఎంతకాలం నుంచి ఆశాభంగం జరుగుతోందో చూడండి.'

'ప్రస్తుత కాలానికి ఎంతో వాంఛనీయమైన సంస్థ.'

'అందుకనే వెనకా ముందూ ఆలోచించకుండా ప్రారంభించాం.'

'మీబోటి సారస్వత సేవా పరాయణులు ఉంటారని ఎన్నడూ అనుకోలేదు.'

'అభిలాష ఎన్నాళ్లనుంచో ఉంది కాని అవకాశం యిప్పుడు చిక్కింది.'

'ఆంధ్రసారస్వతంలో అభ్యుదయంవచ్చినట్లే.'

'ఏదో మీబోటి రచయితల సహకారం ఉండాలి గదు.'

'ఇది అవినాభావ సహకారం.'

'....................

....................'

'మీ రచనలు తెచ్చారా'

'ప్రస్తుతం ఒకటే తెచ్చాను'

'అయ్యో అన్నీ తేలేక పోయారా'

'అన్నీ అంటే నేను పన్నెండు కథానికా సంపుటాలు వ్రాసాను. ఆ పన్నెండు సంపుటాల్లోనూ ఒక్కొక్క సంపుటంలో ఒక్కొక్క ఉత్తమ కథానికను ఏర్చి ఒక సంపుటం కూర్చాను. యీ సంపుటంలోని పన్నెండు కథలూ నా అత్యుత్తమ కథానికలు. ఇంత చక్కని కథలు భవితవ్యంలో వ్రాస్తాననే నమ్మకం కూడా లేదు నాకు'

'మిగతావి కూడా పంపండి. వాటిని కూడా అచ్చువేయిస్తాం.'

'వెళ్ళి పంపుతా లెండి.'

దివ్యశ్రీ కథానికల సంపుటిని అందించాడు. ప్రచురణకర్త దీక్షగా చదువుతున్నాడు,

కథలన్నీ పూర్తిగా చదవడం అయింది. ప్రచురణకర్త సంతృప్తి పొందినట్లు మొహంలో కనిపెట్టి దివ్యశ్రీ సంతోషించాడు.

'పత్రికల్లో ప్రచురణ అయే కథలకి ఏ మాత్రం ప్రతిఫలం ముడుతూంటుంది' అన్నాడు ప్రచురణకర్త.

'అయిదూ, పదీ—పత్రిక తాహతు బట్టి'

'అయితే పన్నెండు కథలకీ అరవై అన్న మాట. సొమ్ము పుస్తకం అచ్చయాక చలామణీ అవుతున్నప్పుడు మీకు పంపుతాం. ప్రస్తుతం మా సంస్థ పురిటిబిడ్డ. బాలారిష్టాలన్నీ తీరి ఆరోగ్యంగా ఉన్నప్పుడు ప్రతిఫలం బాగాముట్ట చెబుతుంది.

దివ్యశ్రీ ఏమీ అనలేక పోయాడు. కాని తను యిరవై రూపాయలు బదులు చేసుక వచ్చాడు.

ఆరునెలలయింది. జ్ఞానోదయా ప్రచురణల వారి దగ్గరనుంచి వార్తలు లేవు. దివ్యశ్రీ వ్రాసిన ఉత్తరాలకి జవాబు కూడా లేదు.

ఒకనాడు దివ్యశ్రీ స్టేషన్‌కి వెళ్లాడు. హిగిన్ బాతమ్స్‌లో పుస్తకాలు తిరగేస్తూంటే ఒక కథానికల సంపుటి కనిపించింది. సహజ ఉత్సాహంతో పేజీలు త్రిప్పాడు. అన్నీ తన కథలే. రచయిత పేరు మాత్రం జ్ఞానోదయ ప్రచురణల యజమానిది. నిలువునా నీరై పోయాడు దివ్యశ్రీ.

# మరణ వాఙ్మాలం

స్మశానములో నా సమాధిపై
మలయమారుతం వీస్తుందట!

పెళ్లాం నా పేరు మీదుగా
సత్ర మొకటి కట్టిస్తుందట!

కోడలి కో కొడుకు పుడితే
నా పేరే పెడతారట!

అల్లుళ్లందరు మూడు రోజులు
పక్షిణీ పడతారట!

అభిమానులు జరుపుతారట
సానుభూతి సభలు!

శిష్యులు కొందరు శిలావిగ్రహం
ప్రతిష్ఠ చేస్తారట!

కవి మిత్రుడొకడు కావ్యం వ్రాసి
స్మారకంకిత మిస్తాడట!

తద్దినాల పురోహితుడు మూడు తరాల్
సంకల్పిస్తాడట నానామం!

వీళ్లంతా విచారించే వాళ్లేనట!
నే చస్తే సంతోషించేదొక
లేనే లేదని నే ననుకున్నే
దేవుడన్నవా డున్నాడంటే!

ఈ విశ్వానికింక వీడుకోలు
ఆ దయ్యానికి (దైవానికి) నా ధన్యవాదాలు!

—యస్. వి. జోగారావు